క్లుప్తంగా

వలంటీర్ల సేవలు అభినందనీయం



వలంటీర్లను సత్కరిస్తున్న కోఆర్డినేటర్ శ్రీనివాస్

ప్రకాశం నగర్: వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక 38వ డివిజన్ సీతంపేట సచివాలయ పరిధిలోని వలంటీర్లు అనంతలక్ష్మి, మౌనిక, శాంతిని అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం జగన్ ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజలకు చిత్తశుద్ధితో వలంటీర్లు సేవలు అందిస్తున్నారన్నారు. ప్రతి ప్రభుత్వ పథకం లబ్ధిదారులకు చేరడానికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ కానుబోయిన సాగర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్ట్ వెనుక బీజేపీ హస్తం

ప్రకాశం నగర్: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు వెనుక బీజేపీ హస్తం ఉందని, ఇటువంటి కక్ష సాధింపు ధోరణి మంచిది కాదని మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ ఆరోపించారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవహారంలో అరెస్ట్ అయిన చంద్రబాబుకు ఇటువంటి చిల్లర పనులు చేతకాదని స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో చంద్రబాబుకు వసతులు కూడా సరిగ్గా లేవని విమర్శించారు.

సారాతో ఒకరి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: వెంకటనగరంలో సారా విక్రయిస్తున్న వల్లూరి దుర్గారావును గురువారం అరెస్టు చేసి, అతడి నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఈబీ రాజమహేంద్రవరం నార్త్‌స్టేషన్ సీఐ పీవీ రమణ తెలిపారు. నిందితుడు సారా తయారు చేసి, గ్రామంలో విక్రయిస్తున్నట్టు తమ విచారణలో తెలిసిందన్నారు.

ఘనంగా హిందీ దినోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: దేశం నుంచి ఆంగ్లేయులను తరిమికొట్టేందుకు నాటి నాయకులు హిందీని దేశభాషగా మార్చి, ఆయుధంగా ఉపయోగించారని సత్యసాయి గురుకులం ప్రిన్సిపాల్ కె.గుర్రయ్య అన్నారు. రాజమహేంద్రవరంలోని సత్యసాయి గురుకులంలో గురువారం హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో సెప్టెంబర్ 14న దేశ అధికారిక భాషగా హిందీని చేర్చారన్నారు. అనంతరం విద్యార్థులు హిందీ గొప్పతనాన్ని వివరిస్తూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కందుకూరి కళాశాలలో..

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం హిందీభాషా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాఘవ కుమారి మాట్లాడుతూ హిందీ విశిష్టతను వివరించారు. ఐక్యు ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ అనురాధ సూర్యకుమారి, వైస్ ప్రిన్సిపాల్ కేఎస్ రత్నకుమార్ పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా ఏలూరు కట్టమంచి రామలింగారెడ్డి అటానమస్ కళాశాల హిందీ విభాగాధిపతి డాక్టర్ కొత్తపల్లి సుమిత్ర హాజరయ్యారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ధవళేశ్వరం: స్థానిక బాలికోన్నత పాఠశాలలో హిందీ భాషా దినోత్సవం జరిగింది. ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ అధ్యక్షత వహించారు. హిందీ ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు కె.శేషాంజలి, కె.సునీత, కె.లలితా నాగవేణి వివరించారు.

నగరంలో శరవేగంగా అభివృద్ధి

- ఎంపీ మార్గాని భరత్ రామ్
- సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కొబ్బరి కాయ కొడుతున్న ఎంపీ భరత్ రామ్

ప్రకాశం నగర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో నగరంలో శరవేగంగా, ప్రజావసరాలకు తగ్గట్టుగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక 8, 9, 10, 11 డివిజన్ల పరిధిలోని దానవాయిపేట, వికాస్ నగర్, సాయి నగర్, తోట రాములు నగర్ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ డివిజన్లలో ఇంటర్నల్ రోడ్ల అభివృద్ధికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నామని, అలాగే డ్రైనేజీలు కూడా నిర్మిస్తామన్నారు. దానవాయిపేట పరిధిలోని గానుగ వీధి, పార్కు ఈస్ట్ రోడ్డు, టీటీడీ రోడ్డు, ఆదిత్య హాస్పిటల్ రోడ్డు, కొప్పిశెట్టి రోడ్లను రూ.2 కోట్లతో సీసీ రహదారులుగా అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. అలాగే 9, 10, 11 డివిజన్ల పరిధిలో రూ.2 కోట్లతో గాదాలమ్మ నగర్ మెయిన్ రోడ్డు నుంచి సాయి నగర్ కనెక్టింగ్ రోడ్డు, సాయి చైతన్య పార్కు నార్త్, సౌత్ సైడ్ రోడ్లు, వికాస్ నగర్, లయన్స్ చిల్డ్రన్ పార్కు సౌత్ సైడ్ రోడ్డుతో పాటు ఆపోజిట్ రోడ్డు తోట రాములు నగర్ 2, 3 వీధులలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్టు చెప్పారు. పనులు కూడా నేటి నుంచి ప్రారంభమయ్యాయన్నారు. గతంలో పుష్కరాలకు టీడీపీ ప్రభుత్వం రూ.2 వేల కోట్లు ప్రత్యేక నిధులు మంజూరు చేసిందని, మరి ఆ నిధులతో ఎక్కడ అభివృద్ధి పనులు చేశారని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీఅధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్లలో నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామని, విశాఖను తలదన్నేలా శోభాయమానంగా అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో అర్బన్ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మార్గాని సురేష్, మార్తి లక్ష్మి, ఎస్వీ శ్రీనివాస్, వార్డు ఇన్‌చార్జులు ఆరే చిన్ని, అడపా అనిల్, ఎండీ గౌస్, ఆర్ఎంసీ ఎస్ఈ పాండురంగారావు పాల్గొన్నారు.

పిల్లలందరూ తప్పకుండా చదువుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ప్రత్యూష కుమారి

రాజమహేంద్రవరం రూరల్: పిల్లలందరూ తప్పకుండా చదువుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ వారికి విద్యకు దూరం చేయరాదని జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. గురువారం కాతేరు గ్రామ సచివాలయంలో జిల్లా సేవాధికారసంస్థ ఆధ్వర్యంలో ఉచిత మరియు నిర్బంధ విద్యాహక్కుచట్టం 2009, ఏడీఆర్, మీడియేషన్ ప్రక్రియల ద్వారా న్యాయ సమస్యల పరిష్కారం అనే అంశాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యూషకుమారి మాట్లాడుతూ 6 ఏళ్ల నుంచి 14 ఏళ్ల పిల్లలు తప్పనిసరిగా చదువుకోవాలన్నారు. బాల కార్మికులు, బాల్య వివాహాలు, అఘాయిత్యాలకు గురవుతున్న పిల్లలు కనిపిస్తే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ లేదా ఇతర సంబంధిత అధికారులకు తెలియజేయడం ప్రజల బాధ్యత అని తెలిపారు. ఆస్తి వివాదాలు, కుటుంబ వివాదాలు, రాజీ పడదగిన అన్ని న్యాయ సమస్యలను ఏడీఆర్, మీడియేషన్ ప్రక్రియల ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు.

ఉత్సాహంగా ఈపీఎఫ్‌వో ఉద్యోగుల టోర్నమెంట్



ఆంధ్రప్రదేశ్ జట్టుతో రాజమహేంద్రవరం ప్రాంతీయ కమిషనర్ మనోజ్ కుమార్

రాజమహేంద్రవరం రూరల్: ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌వో) సౌత్‌జోన్ వాలీబాల్, బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ గురువారం కవలగొయ్యిలోని ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్లో ఘనంగా ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌ను ఈపీఎఫ్‌వో రాజమహేంద్రవరం ప్రాంతీయ కమిషనర్ మనోజ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ పోటీల్లో కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్ జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో ఈపీఎఫ్‌వో అసిస్టెంట్ కమిషనర్ డి.శ్రీనివాస్, పాఠశాల డీన్ హర్షిణీ దేవి, వైస్ ప్రిన్సిపాల్ సైదాభాను, రీజనల్ స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు సభ్యుడు కె.మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పరుగులు



కడియపులంకలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న చందన నాగేశ్వర్

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- కడియపులంకలో గడప గడకూ..

కడియం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో అభివృద్ధి పరుగులు తీస్తోందని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. మండలంలోని కడియపులంక సచివాలయం 1 పరిధిలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించారు. ఎన్నికల వాగ్దానాలను 98 శాతం అమలు చేయడం జరిగిందన్నారు. ఇంకా ఎవరికైనా పథకాలు అందకపోతే గుర్తించి, వారికి కూడా అందిస్తున్నామన్నారు. అర్హతే ప్రామాణికంగా పథకాలు అందుతున్నాయని, జగన్ పాలనపై ప్రజలందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. దళారుల్లేకుండా నేరుగా లబ్ధిదారులకే పథకాలు అందుతున్నాయన్నారు. గ్రామస్థాయిలో ప్రభుత్వ పాలనను ప్రజలకు అందించేందుకు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. రూరల్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంగా అందరినీ సమన్వయం చేసుకుంటూ పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, సొసైటీ చైర్మన్ తిరుమలశెట్టి శ్రీను, పార్టీ నాయకులు ఊటుకూరి శైలజ, బత్తుల రాము, ఆరేటి వెంకట్రావు, ఆలమూరి శ్రీను, చీకట్ల మాచరయ్య, ఐతరెడ్డి అయ్యప్ప, బోడపాటి సత్యనారాణ, అడ్డగర్ల రమేష్, సింగంశెట్టి శ్రీను, ఆకుల ఆదియ్య, తిరుమలశెట్టి వాసు, మండెల బంగారయ్య, దాసరి శ్రీను, ప్రసాద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు ఎస్‌జీఎఫ్ ఎంపికలు

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరులోని జూబ్లీ మెమోరియల్ ఆర్‌సీఎం ఇంగ్లిషు మీడియం స్కూల్లో శుక్రవారం రూరల్ నియోజకవర్గస్థాయి అండర్ 14, 17 స్కూలు గేమ్ ఫెడరేషన్ ఎంపికలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఇబ్రహీం తెలిపారు.

క్రీడల్లో రాణించాలి

కడియం: ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించాలని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ ఆకాంక్షించారు. స్థానిక జపాన్ శోటోఖాన్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు ఇటీవల విశాఖలో జరిగిన కరాటే పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. న్యూఢిల్లీలో జరగబోయే పోటీలకు అర్హత సాధించారు. ఈ నేపథ్యంలో వారిని స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద చందన అభినందించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన కోచ్ జానకిరామ్‌ను అభినందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం

ప్రకాశం నగర్: అర్బన్ నియోజకవర్గస్థాయి ఆటల పోటీలు గురువారం స్థానిక ఎస్‌కేవీటీ హైస్కూల్లో ప్రారంభమయ్యాయి. అర్బన్ రేంజ్ డీఐ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ ఈ పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల నుంచి సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా స్థాయికి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, కోఆర్డినేటర్ ఏవీడీ ప్రసాదరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వస్త్ర ప్రదర్శన



వస్త్రాలను పరిశీలిస్తున్న మహిళలు

ప్రకాశం నగర్: జేఎన్ రోడ్డులోని జేకే గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన వసుధ ఫ్యాషన్ అండ్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ ప్రదర్శన, విక్రయాలు మహిళలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రవీణ్ కుమార్, సీతాకాంత్ మాట్లాడుతూ గృహిణులు, మహిళాలు, విద్యార్థినులకు ఉపయోగపడేలా దేశం నలుమూలల నుంచి ప్రఖ్యాత గాంచిన సుమారు 50కి పైగా డిజైన్ వస్త్రాలను ప్రదర్శనలో ఉంచామన్నారు. ముంబై, ఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కోల్‌కతా, మధ్యప్రదేశ్, చెన్నై, హైదరాబాద్ నగరాల నుంచి ప్రముఖ వస్త్రాలను తీసుకుని వచ్చి నగర ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. ఈ ప్రదర్శన 16వ తేదీ రాత్రి వరకు ఉంటుందన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

రాజమహేంద్రవరం రూరల్: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా బాలింతలు, గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్రబ్యాంకు(డీసీసీబీ) చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. హుకుంపేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆకుల వీర్రాజు చేతుల మీదుగా బాలింతలకు, గర్భిణులకు సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎ.విజయలక్ష్మి మాట్లాడుతూ తక్కువఖర్చుతో పౌష్టికాహారం తయారు చేసుకొనే విధానంపై అవగాహన కల్పించారు. హెచ్ఎం ఎం.సంగేణి, హుకుంపేట సొసైటీ మాజీ చైర్మన్ కురుమళ్ల ఆంజనేయులు, పసలపూడి శ్రీనివాసరావు, ఎస్‌కే మీరావలీ పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



మాట్లాడుతున్న గూడూరి రాధిక

సీటీఆర్ఐ: స్థానిక 48వ డివిజన్‌లో గురువారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు అజ్జరపు వాసు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గూడూరి రాధిక పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మన ఇంటిలో లభించే పదార్థాలలో పోషకాహారం తయారు చేసుకోవచ్చన్నారు. వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఖాదీబోర్డు వైస్ చైర్మన్ పిల్లి నిర్మల, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఎంపీ మార్గాని భరత్ రామ్
- 812 మందికి నూతన పింఛన్ల పంపిణీ



నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీ భరత్ రామ్, చిత్రంలో అడపా శ్రీహరి

ప్రకాశం నగర్: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నదే జగనన్న సంకల్పమని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక వేంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో గురువారం రాత్రి రెండో విడతగా 812 మందికి నూతన పింఛన్లను ఎంపీ భరత్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, అర్బన్ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి పంపిణీ చేశారు. ఎంపీ మాట్లాడుతూ నగరంలో ఫస్ట్ ఫేజ్‌లో 714, సెకండ్ ఫేజ్‌లో 812 పింఛన్లు నూతనంగా మంజూరయ్యాయన్నారు. థర్డ్ ఫేజ్‌లో మరో 1500 మంజూరు చేయిస్తానన్నారు. అధికారులు అర్హుల జాబితా తయారు చేసి ఇవ్వాలని కోరారు. గతంలో టీడీపీ నాయకులు కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు తీసుకునేవారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ పాలనలో అంతా పారదర్శకంగా ఉంటుందన్నారు. 2015 పుష్కరాలకు ప్రభుత్వం ప్రత్యేక గ్రాంటుగా రూ.20 వేల కోట్లు మంజూరు చేస్తే, అభివృద్ధి జరగలేదని, నిధులు మాత్రం కరిగిపోయాయన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ

సీటీఆర్ఐ: 'నాకు చేయి విరిగిపోయింది సార్, ఆరోగ్యశ్రీలో రూపాయి ఖర్చు లేకుండా నాకు ఆపరేషన్ చేశారు' అని ఓ బాలుడు వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌కు వివరించారు. స్థానిక 38వ డివిజన్‌లో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే స్థానికులు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జగన్ పాలనపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రతి ఇంటిలోనూ ఎవరో ఒకరు ఏదో సంక్షేమ పథకం పొందామని సంతోషంగా తెలిపారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. దానికి అనుగుణంగానే ప్రతి రోజు ఇంటింటికి వచ్చి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నామన్నారు. అలాగే 38వ డివిజన్‌లోని నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ బాబు, రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ కానుబోయిన సాగర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పింఛన్ల పంపిణీలో మాట్లాడుతున్న రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్



38వ డివిజన్‌లో నూతన పింఛన్ అందిస్తున్న సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్

పారదర్శకంగా పింఛన్లు

కడియం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పింఛన్ల మంజూరు పారదర్శకంగా జరుగుతోందని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. మండల పరిధిలో ఫేజ్ 2లో భాగంగా కొత్తగా మంజూరైన 380 మందికి గురువారం ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో చందన నాగేశ్వర్ మాట్లాడుతూ సాంకేతిక కారణాలతో పలువురికి పెన్షన్లు నిలిచిపోయాయన్నారు. ఇటీవల నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వాటిని గుర్తించి, అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తున్నామన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా రోజుల తరబడి నాయకుల చుట్టూ తిరగాల్సిన అవసరం ప్రజలకు లేదన్నారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు నాయకులు, అధికారులు లబ్ధిదారుల ఇంటికే వచ్చి, వారి అర్హతలను గుర్తించి సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.